క్లుప్తంగా

భక్తుల పూజలందుకున్న అమ్మవార్లు



సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేని కాలువ గ్రామ పంచాయతీ బండకాడ ఈడిగపల్లెలో వెలసిన శ్రీ నాగారపమ్మ సంతానం ప్రసాదించి భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధిగాంచింది. ఆదివారం ఉదయాన్నే పూజారులు అమ్మవారిని పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు ఉన్నవారు బోనాలు, తలనీలాలు సమర్పించారు.

నల్లగంగమ్మ ఆలయంలో..



సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అర్చకలు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు.

అనంతపురం గంగమ్మ..



లక్కిరెడ్డిపల్లి : మండలంలోని అనంతపురం గ్రామంలో కొలువైన గంగమ్మకు భక్తులు విశేష పూజలు జరిపారు. ఆదివారం కావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతున్న గంగమ్మను దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారి దర్శనం కోసం వచ్చారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు



వేడుకలకు ముస్తాబైన సీతారాముల గుడి

వీరబల్లి : మండలంలోని పెద్దివీడు పంచాయతీలో కొత్తపల్లెలో నూతనంగా నిర్మించిన సీతారామ స్వామి గుడిలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను సోమవారం (నేడు) ప్రారంభమవుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 18వ తేదీ నుండి 20వ తేదీ వరకు నిర్వహించే పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 20వ తేదీ జరిగే విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డిలు హాజరుకానున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. మూడు రోజులు భక్తులు, ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

నేడు పంచముఖి రుద్రాక్షలతో అర్చన

రాజంపేట రూరల్ : ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన అన్నపూర్ణదేవి సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ ఆవరణలో 3వ సోమవారం 1100 పంచముఖి రుద్రాక్షలతో అర్చన చేయనున్నట్లు సద్గురువు శివయ్యస్వామి తెలియజేశారు. పట్టణంలోని ఒక ప్రదేశంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని గుండ్లూరులోని అగస్త్యేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న అవధూత చంగయ్య సజీవ సమాధి అయిన మండలంలో ముందుగా అర్చన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. అదే విధంగా భక్తులకు మహాఅన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

పాదయాత్ర భక్తులకు అల్పాహారం



అల్పాహారం అందిస్తున్న మన్నెం రామ్మోహన్

నందలూరు : హైదరాబాదు నుండి శబరిమలైకు పాదయాత్ర చేస్తూ వెళ్తున్న అయ్యప్ప మాలాధారణ భక్త బృందం ఆదివారం నందలూరుకు చేరుకున్న సందర్భంగా మన్నెం దేవి, స్పెషల్ పోలీస్ ఎస్‌ఐ మన్నెం రామ్మోహన్ అయ్యప్ప భక్తబృందం వారికి అల్పాహార వితరణ చేశారు. అంతేకాకుండా మార్గమధ్యలో అనారోగ్య సమస్యలు తలెత్తకుండా వారికి హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారి ఈగ మధుసూదన్‌రెడ్డి మందులను అందజేశారు.

జూదరుల అరెస్టు

సంబేపల్లె : మండలంలోని మోటకట్ల గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న సమాచారంతో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1900 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మట్లిరాజుల పాలనకు సాక్ష్యాలు.. ఈ శివాలయాలు



రాఘవరాజపురంలోని శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం



కోడూరులోని శ్రీభుజంగేశ్వరస్వామి ఆలయం



చిట్వేలి మండలంలోని సోమేశ్వరస్వామి ఆలయం



పెనగలూరులోని మూలస్థానేశ్వరుడి దేవస్థానం

- నేడు మూడవ కార్తిక సోమవారం
- ముస్తాబైన శివాలయాలు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గంలోని మండలాల్లో పురాతన శివాలయాలు అలనాటి కాలంలో మట్లిరాజుల పరిపాలనకు, ఆధ్యాత్మికతకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఈ ప్రాంతాలలో14, 16 శతాబ్దంలోని శివాలయాలు ఉన్నాయి. వీటిని అప్పట్లో ఓబులవారిపల్లె మండలం వై.కోటను కేంద్రంగా చేసుకుని మట్లిరాజు వంశీయులైన రాఘవరాజు, భూపతిరాజు, అనంతరాజు చుట్టుపక్కల ప్రాంతాలను పరిపాలిస్తూ వారు ప్రయాణాలు చేసే సమయంలో ఆయా గ్రామాలలో ఆలయాలను నిర్మించారని చరిత్ర చెబుతోంది. వీరిపేర్లతో ఊర్లు వెలసినాయి. ముఖ్యంగా కోడూరు మండలంలో మల్లికార్జునస్వామి ఆలయం, భుజంగేశ్వరస్వామి ఆలయాలు అప్పట్లో ఎంతో నైపుణ్యంతో నిర్మించి భూములు కూడా ఏర్పాటు చేశారు. ఓబులవారిపల్లె మండలంలో గుండాలకోన, నీలకంఠేశ్వరుని ఆలయాలు, పుల్లంపేట మండలంలో పర్వతవర్ధిని శాంతిలింగేశ్వరస్వామి ఆలయం, చిట్వేలి మండలంలో సోమేశ్వరస్వామి ఆలయం, పెనగలూరు మండలంలో నాగమల్లేశ్వర స్వామి ఆలయం, కామాక్షి మూలస్థానేశ్వరుడు తదితర ఆలయాలను నిర్మించారు. ఈ ఆలయాల్లో శివలింగాలు పురాతనమైనవిగా పేరొంది భక్తులచే నీరాజనాలు అందుకుంటున్నాయి. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు శివరాత్రి, కార్తికమాసం, మాఘమాసంలలో వేలాదిమందిగా త్రినేత్రుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటుంటారు. ముఖ్యంగా వై.కోట ప్రాంతంలోని గుండాలకోనలో వెలసిన గుండాలేశ్వరుడికి ఎంతో ప్రాశస్త్యం ఉంది. ఆ కాలంలో అగస్త్య మహాముని తపస్సు చేసి ఇక్కడ లింగాన్ని ప్రతిష్ఠించబడినట్టు తెలుస్తోంది. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని ఆలయాలకు ఓ ప్రత్యేకత ఉంది. ఈ ఆలయాలన్ని నేడు మట్లి రాజుల పరిపాలన వారి చరిత్రకు సజీవసాక్షాలుగా నిలిచాయి.



ఓబులవారిపల్లి మండలంలోని గుండాలకోనలో వెలసిన శ్రీగుండాలేశ్వరుడు

ఆలయాలను పరిరక్షించుకోవాలి

ఆలయాలను ప్రతిఒక్కరూ పరిరక్షించుకోవాలి. భావితరాలకు ఇవే గుర్తులుగా ఉంటాయి. గతంలో మన పాలకులు దైవచింతన కోసం మహిమాన్వితంతో కూడిన ప్రాశస్త్యమైన ఆలయాలు ముందు చూపుతో నిర్మించారు. అలానే ఆలయ అభివృద్ధికి ముందుచూపుతో ప్రభుత్వాలు, భక్తులు ముందుకురావాలి.

– కంభం నాగేంద్రరెడ్డి, అయ్యప్ప భక్తుడు, రైల్వేకోడూరు

ప్రభుత్వం అభివృద్ధి చేయాలి

పురాతన ఆలయాలు చారిత్రక సంపద. వాటిని పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత. రాష్ట్రంలోని పురాతన ఆలయాలను గుర్తించి వాటిని అభివృద్ధి చేయాలి. లేకపోతే కాలనుగుణంగా చరిత్ర శిథిలమయ్యే ప్రమాదముంది. అలానే నిత్య కైంకర్యాలకు ప్రభుత్వం నిధులు కేటాయించాలి. మరుగున పడిన ఆలయాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.

– పిడతల రామ్మోహన్‌శర్మ, బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు, ఓరంపాడు, ఓబులవారిపల్లి

సంస్కృతిని కాపాడుకుందాం

ప్రాచీన సంస్కృతికి పెట్టింది పేరు భారతదేశం. అలాంటి దేశంలో సంస్కృతి, సాంప్రదాయాలను ఆచరించడమే కాకుండా, దానిని కాపాడుకోవడం కూడా మన బాధ్యత. నేటి ఇంటర్‌నెట్ యుగంలో పండుగలు, మాసాలు వాటి ప్రత్యేకత తెలియనివారు అనేకం ఉన్నారు. మన సంస్కృతిని నేటి తరానికి వివరించడమే కాక భావితరాలకు మన సాంప్రదాయన్ని ప్రతి ఒక్కరూ తెలియజేయాలి.

– శరసా సాయికుమార్, వేదపండితులు, నారాయణ నెల్లూరు, పెనగలూరు

కోర్కెలు తీర్చే బోడ మల్లేశ్వరుడు



బోడ మల్లేశ్వరస్వామి ఆలయం

పెనగలూరు : మండలంలోని ఈటమాపురం పంచాయతీ, తూర్పుపల్లి గ్రామం వద్ద వెలసిన బోడ మల్లేశ్వరస్వామి కోరిన కోర్కెలు తీర్చే దైవంగా భక్తుల నమ్మకం. మూడో కార్తిక సోమవారానికి ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఈ ఆలయం 13వ శతాబ్దంలో పొత్తపి మట్లి భూపతి రాజు ఇక్కడ శివలింగాన్ని ప్రతిష్ఠించినట్లు శాసనాలు తెలియజేస్తున్నాయి. మట్లి భూపతిరాజు కొత్తపు నుండి శ్రీకాళహస్తికి వెళ్తూ రాత్రివేళ కావడంతో ప్రస్తుతం ఆలయం ఉన్న చోట సేద తీరాడు. మట్లి భూపతి రాజుకు ఇది పుణ్యస్థలం అని శివలింగాన్ని ప్రతిష్ఠించాలని కల వచ్చింది. వెంటనే ఆ స్థలంలో ఒక వేప చెట్టు నాటి అనంతరం శివలింగాన్ని తీసుకువచ్చి ప్రతిష్ఠించాడు. దినదినాభివృద్ధి చెందుతున్న ఆలయం నేడు వేలాది మంది భక్తుల పూజలను అందుకుంటోంది. మూడో కార్తిక సోమవారం రోజున మహా అన్నదానం, శివ పార్వతుల కల్యాణం, చెక్కభజన కార్యక్రమం ఉంటుందని ఆలయ చైర్మన్ కోడూరు వెంకటసుబ్బయ్య తెలిపారు.

శివయ్యకు మహిళల అభిషేక పూజలు



అభిషేక పూజల్లో పాల్గొన్న మహిళలు

రాజంపేట టౌన్ : కార్తిక మాసం అంటేనే ఆధ్యాత్మిక మాసం. ఈ మాసంలో ప్రతి రోజు ఎంతో పవిత్రమైనది కూడా. దీంతో రాజంపేట పట్టణం గంగిరెడ్డిపాలెంలో ఆదివారం ఆ ప్రాంతంలోని మహిళలు శివలింగం, నంది విగ్రహాలకు విశేషంగా పూజా కార్యక్రమాలను చేపట్టారు. ప్రముఖ పురోహితులు నరసింహమూర్తి స్వామివారికి పాలాభిషేకం, తైలాభిషేకం కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి మహిళచే పాలాభిషేకం చేయించారు. మహిళలు శివనామస్మరణ చేయడంతో ఆ ప్రాంతం శివనామస్మరణతో హోరెత్తింది. కాగా పురోహితుడు నరసింహమూర్తి కార్తిక మాసం విశిష్టతను తెలియచేశారు. కార్తిక మాసం ఎంతో పవిత్రమైనదని, ఈ మాసంలో హిందువులు నియమ, నిష్టలతో శివుడిని పూజిస్తే పుణ్యప్రాప్తి కలుగుతుందని తెలిపారు. కార్తిక మాసంలో దీపారాధనకు ఎంతో విశిష్టత ఉందని, అందువల్ల మహిళలు ఉదయం, సాయంత్రం వేళల్లో తమ ఇంటిముంగిట నూనెతో దీపాలను వెలిగించడం ఎంతో శ్రేష్టమైనదని తెలిపారు. కాగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన పూజా కార్యక్రమాల్లో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. దీంతో గంగిరెడ్డిపాళెం ప్రాంతం భక్తులతో సందడిగా మారింది. గంగిరెడ్డిపాలెంకు చెందిన మహిళలు వారి సొంత ఖర్చులతో ముందుండి పూజా కార్యక్రమాలు చేపట్టడం విశేషం. పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేయడంతోపాటు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

రక్తదాన శిబిరం

పుల్లంపేట : అయోధ్య రామ మందిరం కోసం ప్రాణత్యాగాలు చేసిన త్యాగమూర్తులను స్మరించుకుంటూ భజరంగ్ దళ్ ప్రతి ఏడాది రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం పుల్లంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో భజరంగ్ దళ్ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసింది. ఇందులో సుమారు 100 మంది యువకులు రక్తదానం చేశారు. శిబిరంలో సేకరించిన రక్తాన్ని రెడ్ క్రాస్ సొసైటీ వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా సెక్రటరీ శ్రీనివాసులు నాయుడు, అధ్యక్షులు సుధాకర్ బాబు, నరిసింహప్రసాద్, జై సింహ స్వామి, సాధు సుబ్బరాయుడు, పెంచల్ రెడ్డి, మనోహర్ రెడ్డి, అరుణ్‌కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా వెల్‌నెస్ సర్వే

రాజంపేట టౌన్ : మండలంలోని బోయినపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం తనుష్ న్యూట్రీషన్ ఆధ్వర్యంలో ఉచితంగా వెల్‌నెస్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్‌నెస్ కోచ్ సురేష్ విద్యార్థులు, ప్రజలు ఆరోగ్యకరమైన జీవనం సాగించేందుకు తీసుకోవాల్సిన ఆహారపు అలవాట్ల గురించి అవగాహన కల్పించారు. ప్రస్తుతం అనేక మంది దీర్ఘకాలిక వ్యాధుల బారినపడుతున్నారని, అందువల్ల ఆహారపు అలవాట్లలో కొద్దిపాటి మార్పులు చేసుకుంటే ఆరోగ్య సమస్యలు దరిచేరవన్నారు. చాలా మంది ఇబ్బడిముబ్బడిగా ఆహారం తీసుకుంటుంటారని, అలాంటి వారు ఊబకాయం బారిన పడుతున్నారన్నారు. ఊబకాయం సమస్య రాకుండా ఉండాలంటే సమతుల్య ఆహారం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనావుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తనుష్ న్యూట్రీషన్ ప్రతినిధులు శాంతకుమారి, విజయ్‌చంద్ర, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో ఎమ్మెల్యే ఆకేపాటి

ఒంటిమిట్ట : మండల పరిధిలోని రాచగుడిపల్లెలో ఆదివారం జరిగిన మినీగా రామలక్ష్మమ్మ, రవికుమార్‌ల కుమారుడు సాయికుమార్ వివాహ వేడుకలలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ముందుగా కల్యాణానికి విచ్చేసిన బంధుమిత్రులకు ఆయన అభివాదం చేసి వధూవరుల తల్లిదండ్రులను ఆప్యాయంగా పలకరించారు. అనంతరం వధూవరులైన సాయికుమార్, వైష్ణవిలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కూండ్ల ఓబుల్ రెడ్డి, సాంబశివారెడ్డి, రాచగుడిపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు నిత్యపూజ స్వామి కల్యాణం



పూజలందుకున్న శ్రీ నిత్యపూజ స్వామి మూలవిరాట్

సిద్దవటం : లంకమల్ల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజస్వామి ఆలయం భక్తుల కొంగుబంగారంగా భాసిల్లుతోంది. సిద్దవటం మండలంలోని వంతాటిపల్లె గ్రామానికి 13 కిలోమీటర్ల దూరంలోని లంకమల్ల అభయారణ్యంలో 600 సంవత్సరాల కిందట ఉద్భవ లింగం వెలసినట్లు ప్రచారం. ఈ ఉద్భవ లింగానికి ప్రతి నిత్యం సమీప కొలనులో అక్కదేవతలు స్నానాలు చేసి ఎంతో పవిత్రంగా పూజలు నిర్వహించేవారని ప్రతీతి. మహా శివరాత్రి పర్వదినాన, కార్తిక మాసాల్లో నిత్యం స్వామికి పూజలు జరుగుతాయి. కాగా కార్తిక మాసంలో మూడవ సోమవారం (నేడు) శివ పార్వతుల ఉత్సవమూర్తులకు కల్యాణం, ఊరేగింపు నిర్వహించనున్నట్లు అధికారులు తెలియజేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు, పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేశారు.

అందరికీ ఆరోగ్యం అందించడమే ధ్యేయం



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

లక్కిరెడ్డిపల్లి : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించి మంచి ఆరోగ్యాన్ని అందించడమే మానవత ధ్యేయమని మానవత వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నలందా ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవత సేవా కార్యక్రమాలలో భాగంగా నేడు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. రాయచోటికి చెందిన ధన్వి నారాయణ హాస్పిటల్ వైద్యులు గ్రామస్తులను పరీక్షించారు. ఈ కార్యక్రమమంలో మానవత కేంద్ర కమిటీ సభ్యులు ప్రసాద్ యాదవ్, డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, భువనేశ్వరి, స్వాతి రెడ్డి, జానకిరామ్, హరిశ్రీ, ఎలుగోటి శ్రావణి, ప్రసాద్ బాబు, మానవత చైర్మన్ బాల సుబ్రమణ్యం, జిల్లా కన్వీనర్ శివయ్య, ప్రెసిడెంట్ షఫీనాయక్, రవిశంకర్, చైతన్య రెడ్డి, సాయి చరణ్, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో వైద్య శిబిరం

రాయచోటి టౌన్ : రాయచోటి డైట్ కళాశాలలో మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఆదివారం శ్రీ వెంకటేశ్వర అరవింద్ ఐ హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం శస్త్రచికిత్స అవసరమైన వారిని అదే రోజు సాయంత్రం తిరుపతికి తీసుకెళ్లారు. సుమారు 400 మందికి ఈ కంటి పరీక్షలు చేయించుకున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానవత సేవా సంస్థ అధ్యక్షులు ఖాదర్ బాషా, చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, షకీల్, జయచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పకు అంబలం పూజ



రాయచోటి టౌన్: పూజలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు



ఒంటిమిట్ట: విగ్రహ ప్రతిష్ఠలో అయ్యప్ప నామస్మరణ చేస్తున్న భక్తులు



సుండుపల్లె: పడిపూజలో పాల్గొన్న మాలధారులు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా అంబలం పూజ నిర్వహించారు. రాయచోటి ప్రాంతంలోని అయ్యప్ప దీక్షలు చేపట్టిన భక్తులు శనివారం రాత్రి ఆలయంలో ప్రత్యేకంగా శివాలయం ఎదురుగా అయ్యప్ప స్వామి వారి ప్రతిమను ఉంచి పద్దెనిమిది మెట్లు ఏర్పాటు చేసి పూజలు చేశారు. అయ్యప్ప భక్తులకు అక్కడే భిక్ష ఏర్పాటు చేశారు. అనంతం పూజ నిర్వహించుకోవడానికి సహకరించిన ఆలయ ఈఓ డివి రమణారెడ్డిని అయ్యప్ప భక్తులు సన్మానించారు.

ఓదివీడులో నేడు అంబలం పూజ

వీరబల్లె మండలం ఓదివీడు గ్రామం మాండవ్య నది ఒడ్డున వెలసిన శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ సముదాయంలో సోమవారం రాత్రి అంబలం పూజ నిర్వహిస్తున్నట్లు ఓదివీడు అయ్యప్ప భక్తుల సభ్యులు తెలిపారు. మండల పరిధిలోని అయ్యప్ప మాలధారులతోపాటు ఇతర మండలాలలోని అయ్యప్ప భక్తులు విశేషంగా తరలిరావాలని కోరారు. దాదాపు 2000 మందికి పైగా అయ్యప్ప దీక్ష భక్తులు వస్తారనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు.

హరిహర తనయుడికి పూజలు

సుండుపల్లె : మండల కేంద్రంలోని విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో హరిహర తనయుడు అయ్యప్ప స్వామికి మాలాధారులు భక్తిశ్రద్ధలతో ఆదివారం రాత్రి ప్రత్యేక పడిపూజను వైభవంగా నిర్వహించారు. శివలింగానికి అయ్యప్ప విగ్రహానికి ప్రత్యేక పూలతో అలంకరించి నెయ్యి అభిషేకాలు చేసి పూజలు జరిపారు.

వేడుకల నడుమ అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని చెరువుకట్టపై ఉన్న శివాలయం పక్కన ఆదివారం అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరానికి చెందిన అడ్వకేట్ గద్దె మల్లికార్జున విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించారు. ఇందులో భాగంగా అర్చకులు అయ్యప్ప విగ్రహానికి పూజా కైంకర్యాలు జరిపారు. అనంతరం అయ్యప్ప మాలధారులు భజనలు చేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవంలో ఆకేపాటి

ఘనంగా సాయి మందిర 25వ వార్షికోత్సవం



సాయినాథునికి పూజలు చేస్తున్న ఆకేపాటి, పోలా

రాజంపేట టౌన్ : పట్టణంలోని సాయినగర్‌లో వెలసి ప్రసిద్ధిగాంచిన సాయిబాబా మందిరం 25వ వార్షికోత్సవ వేడుకను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో కొలువుదీరిన సాయినాథుడిని ప్రత్యేక పుష్పాలు, పట్టువస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రత్యేక అలంకరంలో కొలువైన సాయిబాబాను దర్శించుకునేందుకు వేకువజాము నుంచే భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. భక్తులు సాయినామ స్మరణ చేస్తూ భజనలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేలాది మంది భక్తులు తరలివచ్చి సాయిబాబాను దర్శించుకొని పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు భోజనం ఏర్పాటు చేశారు.

ప్రత్యేక పూజలు చేసిన ఆకేపాటి

మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ప్రజలందరిపై సాయిబాబా ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయన్నారు. బాబా ఆశీస్సులతో ప్రజలంతా సుఖ, సంతోషాలతో జీవించాలని ఆకేపాటి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, పాపినేని విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌ను గాలికొదిలేశారు



మాట్లాడుతున్న గాజుల భాస్కర్

రాయచోటి టౌన్ : కూటమి ప్రభుత్వం బూటకపు హామీలతో అధికారంలో వచ్చారు. ఇచ్చిన హామీలలోని సూపర్ సిక్స్‌ను గాలికొదిలేశారని కాంగ్రెస్ పార్టీ జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ అధ్యక్షులు గాజుల భాస్కర్ ఆరోపించారు. రాయచోటి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావశంలో ఆయన మాట్లాడుతూ అధికారమే పరమావధిగా ప్రజలను మోసం చేసి మోసపూరిత హామీలు ఇచ్చారని అందులో సూపర్ సిక్స్ ఒకటన్నారు. అధికారంలోకి వచ్చి నెలలు అవుతున్నా ఇప్పటి వరకు సూపర్ సిక్స్ హామీలు ఒకటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. 16 వేల టీచర్ ఉద్యోగాలతో మెగా డీఎస్సీ అని హామీ ఇచ్చారని అయితే దానిని పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి ఊసేలేకుండా పోయిందన్నారు. తల్లికి వందనం పథకం కోసం రూ.12,600 కోట్లు కావాల్సి ఉండగా రూ.5387 కోట్లు కావాల్సి మాత్రమే కేటాయించారన్నారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకం కోసం రూ.10,717 కోట్లు అవసరం కాగా కేవలం రూ.4,500 కోట్లు కేటాయించారన్నారు. అలాగే రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తానని చెప్పిన కూటమి ప్రభుత్వం కనీసం కేటాయింపులు కూడా చేయలేదని ఎద్దేవా చేశారు.

సేవారత్న పురస్కార్‌కు దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్

రాజంపేట రూరల్ : విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని డిసెంబర్ 12న పార్లమెంట్ స్థాయిలో నిర్వహించే సమావేశంలో అందజేసే అన్నమయ్య సేవారత్న పురస్కార్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పార్లమెంట్ విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్ తెలియజేశారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం విభిన్న ప్రతిభావంతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవలో పాల్గొని సేవలు అందించిన వారు ఈ పురస్కార్‌కు అర్హులని తెలియజేశారు. అలానే విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పుల్లంపేట మండలం విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షుడు మల్లు సుబ్బనరసారెడ్డి, రాజంపేట శాఖ ఉపాధ్యక్షులు ఖాదర్‌బాషా, సెక్రటరీ వెంకటప్రసాద్, తిరుపాల్, రాష్ట్ర నాయకులు గుణశేఖర్, భవిత ఉపాధ్యాయని నాగమణి, జాతీయ క్రీడాకారుడు శివకోటి పాల్గొన్నారు.

• ఆదమరిస్తే.. ఆస్పత్రికే!



ఫ్లై ఓవర్‌పై ప్రమాదకరంగా ఉన్న గుంత

పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై నాలుగైదు చోట్ల ఏర్పడ్డ గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. బ్రిడ్జిపై వాహనాలు వేగంగా నడుపుతుంటారు. అయితే బ్రిడ్జిపై గుంతలు ఉన్న విషయం తెలియని పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దాదాపు పది రోజుల వ్యవధిలో నలుగురు ద్విచక్ర వాహనదారులు గుంతల కారణంగా బైక్ అదుపు తప్పి కిందపడి గాయాలపాలైనట్లు స్థానికులు చెబుతున్నారు. గతకొంతకాలంగా బ్రిడ్జిపై గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సంబంధితశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఏదైనా జరగరాని ప్రమాదం జరగక ముందే అధికారులు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఏర్పడ్డ గుంతలను పూడిపించాలని వాహదారులు కోరుతున్నారు.

– రాజంపేట టౌన్

వేడుకగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



ప్రతిష్ఠ పూజలందుకున్న పోతుకొండ్రాయుడు

ఒంటిమిట్ట : మండలంలోని గంగపేరూరు గ్రామంలో ఆదివారం పోతుకొండ్రాయుడు (సిద్దేశ్వర స్వామి) విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గంగపేరూరులోని పురాతన ఆలయమైన శ్రీ పోతుకొండ్రాయుడు ఆలయం శిథిలావస్థకు చేరడంతో ఆలయ కమిటీ పెద్దలు, గ్రామస్తులు ఈ ఆలయాన్ని పునర్నిర్మాణం చేశారు. ఇందులో భాగంగా ఆలయ పునర్నిర్మాణం అనంతరం హోమాలు నిర్వహించి గర్భాలయంలో పోతుకొండ్రాయుడు నూతన విగ్రహాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. స్వామి విగ్రహంతోపాటు వినాయక స్వామి, సుబ్రమణ్య స్వామి వార్ల విగ్రహాలను గర్భాలయంలో ప్రతిష్ఠించారు. ప్రతిష్ఠ అనంతరం నూతన స్వామివారి విగ్రహాలకు అర్చకులు విగ్రహ ప్రతిష్ఠ పూజా కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్న ప్రసాదాలను వడ్డించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.